క్లుప్తంగా

లోక్‌అదాలత్‌లో 4 కేసుల పరిష్కారం

పుంగనూరు: పట్టణంలోని న్యాయస్థానంలో శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించారు. సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తిక్, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధు రెండు మనోవర్తి కేసులు, రెండు వరకట్నం కేసులు పరిష్కరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్, కక్షిదారులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిమారెమ్మ రథోత్సవం



రథంపై ఊరేగుతున్న అగ్నిమారెమ్మ

కుప్పం రూరల్: డీకేపల్లె గ్రామంలోని శ్రీప్రసన్న అగ్నిమారెమ్మ జాతరలో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించారు. అమ్మవారు గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం అగ్నిగుండ మహోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ప్రభాకర్‌నాయుడు తెలిపారు.

వేలం వాయిదా

కుప్పం: మున్సిపాలిటీలో శనివారం జరగాల్సిన వేలం పాట వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ రవిరెడ్డి తెలిపారు. పట్టణంలోని వారపు సంత, దినసరి మార్కెట్, జంతువధశాల, ప్రైవేట్ బస్టాండ్‌కు బహిరంగ వేలం జరగాల్సి ఉన్నా ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. తుదిపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

నో బ్యాగ్‌డేతో మానసికోల్లాసం

● ఎంఈఓ లీలారాణి

పలమనేరు: నో బ్యాగ్ డే అమలు చేయడం ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఎంఈఓ లీలారాణి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెలా మొదటి, మూడో శనివారం నో బ్యాగ్‌డే అమలు చేయాలని తెలిపారు. పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. పిల్లలు బడికెళ్లాలనే ఆశను పెంచడంతో పాటు చదువుపై వారిలో ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పిల్లలు తయారు చేసిన పలు కృత్యాలను చూసి మెచ్చుకున్నారు.



పలమనేరు: విద్యార్థులు తయారు చేసిన కృత్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

పులిచెర్ల(కల్లూరు): చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. పులిచెర్ల హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శనివారం జరిగిన వీడ్కోల సమావేశంలో ఆయన మాట్లాడారు. .. పదో తరగతిలో వచ్చే మార్కులు చాలా కీలకమని.. విద్యార్థులు బాగా చదువుకుని మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంఈఓ సిద్ధరామయ్య, హెచ్‌ఎం సూర్యనారాయణ, సర్పంచ్ రాణెమ్మ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని పెద్దమల్లెల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగార్జున అన్నారు. శనివారం పాఠశాలలో సరస్వతి పూజ చేశారు.

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈఓ లీలారాణి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్లు ఫరీదా, సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.



పులిచెర్ల హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఏర్పాటు చేసిన ఓం

రామకుప్పం: జిల్లా కమ్యూనిటీ మానిటరింగ్ ఆఫీసర్ (డీసీఎంఓ) గుణశేఖర్ రెడ్డి, జిల్లా అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఏఎంఓ) లావణ్య స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు.

ఎల్‌ఈడీ బల్బ్ తయారీపై వర్క్‌షాప్

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఎల్‌ఈడీ బల్బ్ తయారీ విధానంపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. కృష్ణగిరి ప్రవీణ్ సొల్యూషన్స్‌తో కలిసి వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఆరు రోజుల వర్క్‌షాప్‌లో ఎల్‌ఈడీ బల్బును ఎలా తయారు చేయాలి, బల్బు ఏ విధంగా పని చేస్తుంది అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. చైర్మన్ సునీల్, ఏడీ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

కోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగవరం: కీలపట్ల శ్రీకోనేటి రాయారస్వామి ఆలయంలో శనివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో పాల్గొని భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఆలయ అధికారులు భక్తులకు పట్టువస్త్రాలను పంచిపెట్టారు.



అకాల వర్షాలతో సస్యరక్షణ చర్యలు

శాంతిపురం: అకాల వడగండ్ల వానలు కురిసిన నేపథ్యంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంట నష్టాన్ని అదుపు చేయాలని మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. వడగండ్లతో ఆకులు చీలిపోవడం, కాయలు, కంకులు దెబ్బతినడం, పూత, పిందెలు రాలిపోవడం జరుగుతాయన్నారు. ఈ నష్టాన్ని నియంత్రించడానికి రైతులు లీటరు నీటికి 1 గ్రాము కార్బండిజం లేదా 2.5 గ్రాముల డైథేనియం ఎం–45, లేదా 1 గ్రాము ప్రోపికెనజోల్ కలిసి పిచికారీ చేసుకోవాలన్నారు. దీని వల్ల పంటలో ఆకుమచ్చ, కాయకుళ్లు, ఎండు తెగులు రాకుండా అదుపు చేయవచ్చని తెలిపారు.

మండల మీట్ వాయిదా

కుప్పం: కుప్పం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ జానకమ్మ తెలిపారు. సభ్యులు మార్పును గమనించాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతికి చెందిన 130 మంది విద్యార్థులకు కల్యాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్ చేతుల మీదుగా రైటింగ్ ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఎంఈఓ చంద్రశేఖర్, ఫౌండేషన్ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, హెచ్‌ఎం నటరాజరెడ్డి పాల్గొన్నారు.

పలమనేరు: పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే డిగ్రీ, ఇంటర్, టెన్త్ విద్యార్థులకు పట్టణంలోని పోలీస్‌లైన్ కార్నర్‌స్టోన్ చర్చికి చెందిన లైట్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రైటింగ్‌ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. పాస్టర్ జాన్, శామ్యూల్, మేరీజాన్, దివ్య పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి అందజేస్తున్న సీఐ, ఎంఈఓ

రాజనాలబండలో ప్రత్యేక పూజలు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలు చేశారు. భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది.

అధికారులకు సన్మానం



పుంగనూరు: శ్రీసుగుటూరు గంగమ్మ జాతరను పటిష్టంగా నిర్వహించిన అధికారులను ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, సీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ మోహన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, మున్సిపల్ కాంట్రాక్టర్ శ్రీరాములును సత్కరించారు. కమిటీ సభ్యులు రాజు, అశోక్, భానుప్రసాద్, కృష్ణప్ప పాల్గొన్నారు.

నేడు పురస్కారాల ప్రదానోత్సవం

పలమనేరు: ఉగాదిని పురస్కరించుకుని పట్టణంలోని కళాక్షేత్రంలో ఆదివారం ఆరుగురు కవులకు జాతీయ స్మారక పురస్కారాలను అందజేయనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప తెలిపారు. తెలుగుభాష, సాహితీ అభిమానులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సోమల: పేటూరు పంచాయతీ పోలికిమాకులపల్లె వద్ద శనివారం పేకాట ఆడుతున్న 8 మందిని సోమల పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పారిపోయారు. నిందితుల నుంచి రూ.33 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మారుతి తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 16 మంది గైర్హాజరు

పుంగనూరు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మూడు సెంటర్లలో శనివారం మొత్తం 807 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 16 మంది విద్యార్థులు హాజరుకాలేదు.

రేపు వారపు సంత వేలం

శాంతిపురం: బడుగుమాకులపల్లి వారపు సంత గేటు వసూలుకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హేమమాలిని, సర్పంచ్ ఏవీ జయరాం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కెనమాకులపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద వేలం పాట జరుగుతుందన్నారు. వారపు సంత, పశువుల సంత, ప్రైవేట్ వాహనాలు, గొర్రెలు కోళ్ల గేటు వసూలుకు ఒక్కోదానికి రూ.2 లక్షల డిపాజిట్, రూ.5 లక్షల విలువకు సాల్వెన్సీ ఇవ్వాలన్నారు.

–రామకుప్పం: రామకుప్పం పంచాయతీలో వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు వాహనాల నుంచి రుసుం వసూలు చేయడానికి హక్కులు పొందేందుకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరవిప్రసాద్, సర్పంచ్ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు వేలం పాట జరగనుంది.